నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 17 మార్చి 2023

రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్న రేవంత్‌రెడ్డి సభను ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్త విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు యాదవ రెడ్డి పేర్కొన్నారు. గురువారం గడప గడపకూ కాంగ్రెస్ మేనిఫెస్టోకు సంబధించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి, జిల్లా నాయకులు కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వీరన్న, టౌన్ అధ్యక్షులు గంగాధగౌడ్, సొసైటీ మాజీ వైస్ చైర్మెన్ జుకంటి సుధాకరరెడ్డి, యువజన నాయకులు అంకం కృష్ణారావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు జయసింహ, మైనార్టీ మండలాధ్యక్షులు షాదుల్, కాంగ్రెస్ నాయకులు సిద్ధ రాములు, బాలరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-దోమకొండ

గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని జడ్పీటీసీ తీర్మల్ గౌడ్, సర్పంచ్ నాంపల్లి అన్నారు. దోమకొండ మండలంలోని సీతారాంపల్లి గ్రామంలో గురువారం సీసీ రోడ్డు పనులను జడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కృషి చేస్తున్నారని, దోమకొండ మండలానికి రూ.2కోట్ల 20లక్షల నిధులు ఇచ్చారని, అందులో భాగంగా సీతారాంపల్లి గ్రామానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల ద్వారా రూ.10 లక్షలతో మెయిన్ రోడ్డు నుంచి గ్రామంలో కాలనీల వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జాలిగామ నాంపల్లి, కానుగంటి నాగరాజు, వెన్నెల సిద్ధ రాములు, వెన్నెల శాంతం, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఫైల్ మాయం

- యూఆర్ఎస్‌లో ఆగిన పోస్టుల భర్తీ
- ఐదు పోస్టులకు 2022లో దరఖాస్తులు
- అర్హులను గుర్తించినా ప్రకటించని వైనం
- పైరవీలతో మొత్తంగా ఫైల్ మాయం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

నిజామాబాద్ నగరంలోని పట్టణ గురుకుల పాఠశాల(అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్)లో కాంట్రాక్టు పద్ధతిలో ఐదు పోస్టులు భర్తీకి సంబంధించిన ఫైల్ కలెక్టరేట్‌లో మాయం అయ్యింది. ఈ పోస్టుల భర్తీకి పెద్దఎత్తున పైరవీలు జరగడంతో అర్హులు ఖరారు అయినా నెలల తరబడి ప్రకటించలేదు. దీంతో నవతెలంగాణలో 'కాంట్రాక్టు పోస్టులకూ పైరవీలు' అంటూ కథనం ప్రచురించాం. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించి సంతకం చేసి తదుపరి చర్యలకు ఏటకు పంపారు. కానీ ప్రస్తుతం ఆ ఫైల్ కనిపించడం లేదు. మరోవైపు యూఆర్ఎస్‌లో సరిపడా సిబ్బంది లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నగరంలోని ఖిల్లా యూఆర్ఎస్‌లో కాంట్రాక్టు విధానంలో ఐదు పోస్టులను భర్తీ చేసేందుకు నవంబర్ 2022న విద్యాశాఖ అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఇందులో అకౌంటెంట్-1, అసిస్టెంట్ కుక్-2, సీఆర్‌టీ సైన్స్, పీఈటీ పోస్టులున్నాయి. పోస్టులకు స్థానికుల నుంచి పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఒక్క అకౌంటెంట్ పోస్టుకు 20కి పైగా దరఖాస్తులు వచ్చాయి. ఒకే పోస్టు ఉండటంతో మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేయాలి. స్కూల్ అసిస్టెంట్ల సాయంతో ఆ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి అర్హులను ఎంపిక చేశారు. ఆ ఫైల్‌ను కలెక్టర్ ఆమోదానికి పంపారు.


కాంట్రాక్టు పోస్టులకూ పైరవీలు

నవతెలంగాణలో ప్రచురితమైన కథనం..

కానీ కలెక్టరేట్‌లో నెలల తరబడి ఫైల్ పెండింగ్‌లో పడింది. అయితే అర్హులను కాదని, తమకు సంబంధించిన వారికి పోస్టు ఇచ్చేందుకు జోరుగా పైరవీలు సాగినట్టు సమాచారం. దీంతో ఆ దస్త్రం పక్కకు పడింది. ఈ నేపథ్యంలో 'కాంట్రాక్టు పోస్టుల కూ పైరవీలు' అంటూ నవతెలంగాణలో కథనం ప్రచురించాం. కథనం వెలువడిన మరుసటి రోజు అప్పటి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి స్పందించారు. పెండింగ్ ఫైల్‌ను క్లియర్ చేశారు. తదుపరి ఆదేశాలు తీసుకోవాల్సిందిగా ఏటకు పంపారు. కానీ ప్రస్తుతం ఆ ఫైల్ మొత్తానికి మిస్సయ్యింది.

నెలల తరబడి ఎదురుచూపులు..

విద్యాశాఖలో ఐదు పోస్టుల ప్రకటన నేపథ్యంలో ఉపాధి లభిస్తుందని ఆశించిన నిరుద్యోగుల కలలు నెరవేరడం లేదు. దాదాపు ఐదు నెలలు కావొస్తున్నా ఇప్పటికీ పోస్టులు భర్తీ చేయడం లేదు. తమకు ఉద్యోగం వస్తుందేమోనని ఎదురుచూస్తున్న అభ్యర్థుల నిరాశలో ఉన్నారు. ఇక పోస్టుల భర్తీ కాకపోవడంతో ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వంద మంది విద్యార్థుల సామర్థ్యం కలిగిన యూఆర్ఎస్ స్కూల్‌లో ప్రస్తుతం 80 మంది వరకు విద్యార్థులున్నారు. ఈ 80 మంది విద్యార్థులకు ప్రస్తుతం ఒకే ఒక్క వంటమనిషి ఉన్నాడు. పైగా ఆయన యాభైపదులు దాటడంతో అంత మంది విద్యార్థులకు భోజనం చేయడం ఇబ్బందిగా మారింది.


అసిస్టెంట్ కుక్ లేకపోవడంతో 80 మంది విద్యార్థులకు వంట చేస్తున్న ఒకే వంటమనిషి..

మేకల సంత.. ఆదాయం ఎంత?

- హైడ్రామా మధ్య రికార్డు వేలం రద్దు!
- నేడే రెండవసారి సంతల వేలంపాట
- మేకలు గొర్రెలతో పాటు వాహనాల ఆదాయం..
- దళారి దందాతోనూ!
- కోటికి పైగా టర్న్ "ఓవర్"
- సిండి "కేటుగాళ్ల" బుజ్జగింపులు కొనసాగేనా?

నవతెలంగాణ-నవీపేట్

తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద మేకల సంత అయిన నవీపేట్ మేకల సంత వేలంపాట మొదటిసారి రద్దయి రెండవసారి శుక్రవారం నిర్వహించనుండడంతో మేకల సంత ఆదాయం ఎంత అని సర్వత్ర చర్చించుకుంటున్నారు. 2021-22 సంవత్సరం 44 లక్షలకు పైగా పాడిన మేకల సంత వేలంపాట సిండికేటుగాళ్ల హైడ్రామాతో కేవలం 33 లక్షల 51 వేల రూపాయలకు గత ఏదాది దక్కించుకున్నారు. ఈనెల 13వ తేదీన మేకల సంత వేలంపాట నిర్వహించగా 87 మంది లక్ష రూపాయలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పోటాపోటీగా పాల్గొన్నారు. దీంతో బహిరంగ వేలంపాటలో రూ.55 లక్షల 16 వేలకు రికార్డు ధరకు సలీం దక్కించుకున్నారు. రెండవ వేలంపాట దారుడు సౌదా శ్రీనివాస్ రూ.55 లక్షల 15వేలు పలుకగా మూడవ వేలంపాట దారు చిప్ప నవీన్ రూ.55 లక్షల 13 వేలు పలికారు. పంచాయతీ నిబంధనల ప్రకారం అదే రోజు వేలం పాటలోని 25శాతం పంచాయతీకి చెల్లించాల్సి ఉండగా చెల్లించకపోగా రెండు రోజులపాటు హైడ్రామా కొనసాగింది. రెండవ వేలంపాటదారుడు సౌదా శ్రీనివాస్ సైతం ఆసక్తి చూపకపోవడంతో పాలకవర్గం మొదటి వేలంపాటదారుడు సలీం డిపాజిట్ రూ.లక్ష జప్తు చేసి భవిష్యత్తులో వేలంపాటలో పాల్గొనకుండా అతని పేరు బ్లాక్ లిస్టులో పెట్టనున్నట్లు పాలకవర్గం ప్రకటించింది.

మేకల సంత ఆదాయం ఎంత..?

మేకల సంత కాంట్రాక్టర్‌కు మేకలతో పాటు ప్రధానంగా వాహనాల ద్వారా ఆదాయం వస్తుంది. సంవత్సరానికి 52 శనివారాలు రాగా ప్రతి వారానికి రెండు లక్షలకుపైగా ఆదాయం ఉన్నట్టు పలువురు లెక్కలు వేసుకుంటున్నారు. ప్రతి శనివారం జరిగే మేకల సంతకు పదివేల నుంచి 15 వేల మధ్య మేకలు, గొర్రెలు వస్తాయి. మేకలు తీసుకుని వచ్చే పెద్ద వాహనాలతో పాటు చిన్న చిన్న ఆటోలు కలిపి 500కు పైగా వస్తాయి. పంచాయతీ నిబంధనల ప్రకారం మేక, గొర్రెకు రూ.ఐదు, చిన్న ఆటోకు రూ.25, పెద్ద ఆటోకు రూ.50, పెద్ద వాహనాలకు రూ.100 వసూలు చేయాల్సి ఉండగా మేకకు రూ.10 నుంచి 30, వాహనాలకు రూ.50 నుంచి 500 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అందులోనూ మేకల అమ్మకం దారులతోపాటు కొనుగోలు దారుల వద్ద సైతం రుసుము తీసుకోవడంతో రెట్టింపు ఆదాయం వస్తుంది. ప్రశ్నిస్తే సంత వేలం పాటకై లక్షలు చెల్లిస్తున్నామని పంచాయతీ పాలకవర్గంతో పాటు జిల్లా ఉన్నతాధికారులకు మామూళ్లు పంచామని బాహటంగానే చెబుతూ క్రయ, విక్రయ దారుల దగ్గర అధిక మొత్తం వసూలు చేస్తూ బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో మొదటి వేలంపాట అనంతరం ఖచ్చితంగా పంచాయతీ నిర్ణయించిన ధరలనే వసూలు చేయాలని మిగతా పాటదారులు పట్టుబట్టడంతో రికార్డు ధర పలికిన వేలం హై డ్రామా మధ్య గురువారం రద్దయింది. దీంతో పాత కాపులు ధరలను పెంచాలని పాలకవర్గంపై ఒత్తిడి తెచ్చినప్పటికీ ఫలించలేదు. ఒక సందర్భంలో వేలంపాట కోటి రూపాయలు పలికిన వెయ్యి రూపాయలు ఎక్కువ చెల్లించి పాత కాపులే దక్కించుకుంటారని మధ్యవర్తులు బాహటంగానే చెప్పడం ఈ ఏడు ఎన్నికలు సైతం ఉండడంతో మేకల సంత ఆదాయం కోటికిపైగా ఉంటుందని లెక్కలేసుకుంటున్నారు.

దళారి దందాతోనూ..

నవీపేట్ మేకల సంతలో క్రయవిక్రయాలు జరగడంలో దళారుల పాత్ర కీలకంగా మారింది. మేకల సంత కాంట్రాక్టర్ వీరి వద్ద నుంచి రూ.100 నుంచి 500ల వరకు తీసుకుంటూ ప్రోత్సహిస్తున్నారు. ఈ దళారులు సంతకు వచ్చే కొనుగోలుదారులను మాటలతో మచ్చిక చేసుకుని విక్రయదారుల వద్ద తీసుకొని కోడ్ లాంగ్వేజ్ కైలా' అంటే రూ.100, "జోడ్ కైలా" అంటే రూ.200, "కమ్మాస్" అంటే రూ.500, "టోకిని" అంటే రూ.1000 ఉపయోగిస్తూ కొనుగోలుదారులకు టోకరా వేస్తున్నారు. దళారులు ప్రతి సంతలో 2000 నుంచి 5000 రూపాయలు సంపాదిస్తుండడంతో దళారుల సంఖ్య సైతం పెరిగి కాంట్రాక్టర్‌కు గుడ్‌విల్‌గా కొనసాగుతోంది.

నిబంధనలు కఠినతరం..

నవీపేట్ మేకల, వారాంతపు సంతలు రికార్డు స్థాయిలో పలికి రద్దవ్వడంతో సర్పంచ్ ఏటీఎస్ శ్రీనివాస్, పాలకవర్గం నిబంధనలను కఠిన తరం చేసింది.

శుక్రవారం జరిగే వేలంపాటలో మొదటి వేలంపాటదారుడు సాయంత్రం ఐదు గంటలలోపు 25శాతం చెల్లించని యెడల రెండవ వేలంపాట దారుడుకి సాయంత్రం 6 గంటల వరకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని అతను సైతం 25 శాతం చెల్లించకపోతే మొదటి వేలం పాట దారుడుతో పాటు రెండవ వేలంపాట దారుడి డిపాజిట్ సైతం జప్తు చేసి తిరిగి వేలం పాట నిర్వహించబడుతుందని పాలకవర్గం తీర్మానం చేసినట్టు విలేకరుల సమావేశంలో తెలిపారు. శుక్రవారం వేలంపాట పారదర్శకంగా జరిగితే పంచాయతీకి ఘననీయంగా ఆదాయం పెరిగే అవకాశం ఉంది.


కిక్కిరిసిన నవీపేట్ మేకల సంత

పంచాయతీ ఆదాయానికి గండి కొట్టొద్దు



మేకల సంతవలన నవీపేట్ పంచాయతీకి ఘననీయంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కానీ వేలం పాటలో సిండికేటు కారణంగా పంచాయతీ ఆదాయానికి పెద్ద మొత్తంలో గండి పడుతుంది. కాబట్టి ఆదాయాన్ని పెంచేందుకు పాలకవర్గం పట్టుదలతో ఉండాలి. దీంతో ప్రజలకు మౌలిక వసతుల పెంపుదలతో పాటు సఫాయి కార్మికుల సంఖ్యను పెంచడమే కాక కార్మికుల జీతాలు సైతం పెంచవచ్చు.

- నాయక్‌వాడి శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు

సంతలో సౌకర్యాలు కల్పించాలి



దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రయవిక్రయదారులకు వసతితోపాటు డబ్బు, వస్తువులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి. తరచూ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సంతలో నిఘా పెంచాలి. అలాగే మేకల, గొర్రెల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలి. ఎండలు విపరీతంగా పెరుగుతుండడంతో దాహంతో జీవాలు చనిపోతున్న సందర్భాలెన్నో ఉన్నాయి. కాబట్టి సంత ఆదాయం పెంచి సౌకర్యాలు పెంచితే పాలకవర్గానికి మంచి పేరు వస్తుంది.

- అంజద్ ఖాన్, స్థానికుడు

పెట్టుబడుదారుల కోసం పనిచేస్తున్న కేంద్రం

- చలో నిజామాబాద్‌ను జయప్రదం చేయాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-బోధన్

దేశంలో ఆదాని, అంబానీ లాంటి పెట్టుబడు దారుల కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు విమర్శించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 24వ తేదీన సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలో నిజామాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు కోరారు. గురువారం బోధన్ పట్టణంలో నిర్వహించిన పార్టీ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత కలెక్టర్ కార్యాలయం వద్దగల ఎన్టీఆర్ చౌరస్తాలో జరిగే బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ వ్యాప్తంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మూడు బస్ జాతాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రం నుంచి ఒక బస్ జాత ప్రారంభమవుతుందని, దీనికి సీపీఐ(ఎం) పోలిట్‌బ్యూరో సభ్యులు విజయ రాఘవన్ హాజరువుతున్నట్టు తెలిపారు. ఈ బస్‌జాతాలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ, చుక్కా రాములు, టి.సాగర్, రాష్ట్ర నాయకులు వెంకట్ రాములు, రమ, జిల్లా నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాలోని సీపీఐ(ఎం) సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరించే మతోన్మాదం, ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన చేపట్టనున్నట్టు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగాధరప్ప, సబ్బని లత, శంకర్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు యేశాల గంగాధర్, బోధన్ ఏరియా కమిటీ సభ్యులు కుమారస్వామి, కామ్రేడ్ బాలయ్య, సంఘం గంగాధర్, మారాబాయి, శశికళ, లక్ష్మీ, నాగమణి, గోపి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.


సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

ధరణి టౌన్ షిప్ వేలం పాటలో పాల్గొనాలి



నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

ధరణి టౌన్‌షిప్ వేలం పాటలో ఆసక్తి గల వ్యక్తులు పాల్గొని ప్లాట్లను సొంతం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో గురువారం ధరణి టౌన్షిప్ పాట్ల వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఈనెల 16,17,18 వ తేదీలలో ప్లాట్లు కావలసిన వ్యక్తులు వేలంపాటకు హాజరై తమకు నచ్చిన ప్లాట్లను పొందే వెసులుబాటు కలుగుతోందని తెలిపారు. ఈ నెల 20,21న వివిధ దశలో ఉన్న గృహాలు వేలం పాట ద్వారా పొందే వీలుందని చెప్పారు. వేలంలో పాల్గొనేవారు పదివేల రూపాయలు ఈఎండీ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం చిందం రమేష్, టీఎస్ఐఐసీ డిప్యూటీ జనరల్ మేనేజర్ రాందాస్, రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, తహసీల్దార్ వెంకట్‌రావు అధికారులు పాల్గొన్నారు.

ఐకాన్ లీడింగ్ అవార్డులకు మహిళల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-బోధన్

పారిశుధ్య పనుల్లో ప్రతిభ చూపిన మహిళల నుంచి మహిళా ఐకాన్ లీడింగ్ స్వచ్ఛత ఉత్సవాలు 2023 అవార్డులు పొందుటకు మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని బోధన్ మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వాహణలో చురుగ్గా పాల్గొన్న మహిళలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత, స్వయం సహాయక సంఘాలు, చిన్న తరహా సంస్థలు ఎవరైనా సామాజిక మరుగుదొడ్ల నిర్వాహణ, సెప్టిక్ ట్యాంక్ శుభ్రత, వ్యర్థాల శుద్ధీకరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ, తడి చెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయడం వంటి విభాగాల క్రింద కృషి చేస్తున్న మహిళలు ఈ అవార్డులకు అర్హులని ఆసక్తి ఉన్నవారు. ఈ నెల 22 తేదీలోపు బోధన్ పురపాలక సంఘం కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి జూన్ 5వ తేదీన జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ఈ అవార్డులను అందచేయనున్నట్టు పేర్కొన్నారు.

తిరుమల ఇనిస్టిట్యూట్స్‌లో ర్యాగింగ్ కలకలం

- సీనియర్లు వేధిస్తున్నారని జూనియర్ల ఫిర్యాదు..
- విద్యార్థుల్లో ఆందోళన..

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని బర్దిపూర్ గ్రామ పంచాయతీ శివారులోని తిరుమల ఇనిస్టిట్యూట్స్ ఆవరణలోని తిరుమల నర్సింగ్ కళాశాలలో గురువారం ర్యాగింగ్ కలకలం సృష్టించింది. బీ ఫార్మసీకి చెందిన సీనియర్లు తమను ర్యాంగింగ్ చేస్తున్నారని సెకండియర్ విద్యార్థినులు ఆరోపించారు. గురువారం తాము ఫ్రెషర్స్ పార్టీ చేసుకుంటుండగా సీనియర్ విద్యార్థులు ఫ్లెక్సీ చించివేసి అడ్డుకుని తమను పరుష పదజాలంతో వేధింపులకు గురిచేశారని జూనియర్ విద్యార్థులు తెలిపారు. గతంలో ఇలాగే ర్యాగింగ్‌కు పాల్పడితే కాలేజ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వ్యక్తిగత వివరాలు అడుగుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. విషయం తెలుసుకున్న డిచ్‌పల్లి ఎస్సై కచ్చకాయల గణేష్ తన తోటి సిబ్బందితో కాలేజ్‌కు చేరుకున్నారు. జూనియర్లు, తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నలుగురు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్కు స్తుతరలించారు. ర్యాగింగు పాల్పడిన విద్యార్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై హామీ ఇవ్వడంతో జూనియర్లు శాంతించారు. అయితే సీనియర్ విద్యార్థులు జూనియర్లను వేధించలేదని చెప్పడం కొసమెరుపు, ర్యాగింగ్ విషయమై తిరుమల ఇనిస్టిట్యూట్స్ యాజమాన్యాన్ని సంప్రదించేందుకు యత్నించగా స్పందించలేదు.

ఎల్లారెడ్డిలో 'డబుల్' మంటలు

- లబ్దిదారుల ఎంపికలో అవకతవకలపై రాస్తారోకో
- స్తంభించిన వాహనాలు
- పలువురి అరెస్ట్.. స్టేషన్‌కు తరలింపు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను పంపిణీ చేసేందుకు గానూ అధికారులు గురువారం డ్రా పద్ధతిన లబ్దిదారులను ఎంపిక చేశారు. అయితే ఈ ఎంపిక ప్రక్రియలో అవినీతి జరిగిందరూ కొందరు పేదలు రాస్తారోకో చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. ఎల్లారెడ్డి పట్టణ పరిధిలో నిర్మించిన 300 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు గానూ 1456 దరఖాస్తులు వచ్చాయి. కాగా అందులో 630 లబ్దిదారులను అధికారులు ఎంపిక చేశారు. ఈ 630లో గురువారం డ్రా పద్దతిన లబ్దిదారుల ఎంపిక చేపట్టారు. మొదటగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో స్థానిక తహసీల్దార్ సుధాకర్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. 12 వార్డుల్లో సైతం స్పెషల్ అధికారుల చే డ్రా పద్దతిన ఎంపిక చేశారు.

ఎంపికపై తీవ్ర ఆందోళన..

అనంతరం డ్రాలో ఇండ్లకోసం ఎంపిక కాని లబ్దిదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఎల్లారెడ్డి తహసీల్దార్ కార్యాలయం ముందు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున మహిళలు రోడ్డుపై సుమారు 2 గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. లబ్దిదారుల ఎంపికలో తీవ్ర అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ ఆందోళనలో పలువురికి గాయాలయ్యాయి. డ్రాలో తమ పేరు రాని వారు స్థానిక ఎమ్మెల్యేపై, మున్సిపల్ చైర్మన్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 30 సంవత్సరాల నుంచి అద్దె ఇండ్లలో ఉంటున్నామని కానీ తమకు ఇల్లు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఆందోళనకు మద్దతుగా బీజేపీ నాయకులు రావటంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. తోపులాట మధ్య బీజేపీ నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలువురు మహిళలు తమకు ఇల్లు రాకపోతే ఆత్మహత్య కూడా సిద్ధమని తేల్చిచెప్పారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా.. వారు వినకపోవడంతో మహిళలను సైతం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ గణేష్ తెలిపారు.


రాస్తారోకో చేస్తున్న లబ్దిదారులు

పారదర్శకంగా లబ్దిదారుల ఎంపిక : ఆర్డీఓ

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్‌ల ఎంపికలో పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని ఎలాంటి అవకతవకలు జరగలేదని ఆర్డీవో శ్రీనునాయక్ తెలిపారు.

మహిళలు అభివృద్ధి ప్రదాతలు

- జిల్లాజడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-నిజామాబాద్

మహిళల హక్కుల కోసం ఎన్నో తరాలు పోరాడిన ఫలితమే నేటి తరం మహిళ సాధికారత అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. అవనిలో, ఆకాశంలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని దేశ ప్రగతి పథకానికి తనవంతు మేధోసంపత్తిని అందిస్తున్నది ఆమె తెలిపారు. గురువారం నిజామాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్య, వైద్యం, వాణిజ్యం, వ్యాపారం సహా అన్ని రంగాలలో మహిళలు పురోగమిస్తున్నారని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో, రాజకీయాలతో, కార్యనిర్వాహక వ్యవస్థలో, సామాజిక సేవారంగంలో మహిళలు సమున్నత స్థానానికి చేరువ అవుతున్నారని అన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాలలో మహిళల శ్రమను కొలవలేమని ఆమె విశ్లేషించారు. వ్యవసాయ పనులలో వారి శ్రమ మూలంగానే ఎన్నో ఆహార ఉత్పత్తులు మార్కెట్‌లో విరివిగా లభ్యం అవుతున్నాయని తెలిపారు. మహిళల సంక్షేమానికి ఉన్న చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసను, అణచివేతను, వివక్షను నిర్మూలించడానికి ఉన్న చట్టాలను వినియోగించుకోవాలని అన్నారు. అదనపు జిల్లా జడ్జి షౌకత్ జహాన్ సిద్ధికి మాట్లాడుతూ.. మహిళల సాధికారత అనేది కుటుంబం నుంచి ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఉన్న అవకాశాలను ఒడిసిపట్టుకుని మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను దక్కించుకోవాలని అన్నారు. బార్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి మహిళసాధికారతకు జిల్లాకోర్టు ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న మహిళ న్యాయమూర్తులు, ఉద్యోగినులే నిదర్శనమని అన్నారు. దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళ న్యాయవాదులు నీరజరెడ్డి, అజితరెడ్డి, కవితరెడ్డి, కల్పన, మానస, ప్రవీణ, రజితలు జిల్లాజడ్జి సునీత, అదనపు జిల్లాజడ్జి షౌకత్, సీనియర్ సివిల్ పద్మావతి, జూనియర్ సివిల్ జడ్జిలు సౌందర్య, భవ్య, గిరిజను శాలువా, పూల మొక్కలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో గవర్నమెంట్ ప్లీడర్ శ్రీహరి ఆచార్య, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పిడుగు రవిరాజ్, న్యాయవాదులు సుభద్ర, ఝాన్సీ రాణి, మైథిలీ, జాన్సీ నాయక్, కావ్య తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
నిజామాబాద్
2
శుక్రవారం 17 మార్చి 2023

కానిస్టేబుల్‌కు సన్మానం

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో గత సంవత్సరం కాలం నుండి విధులు నిర్వహించి బదిలీపై నిజామాబాద్ 5 వ టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ రాంబాబును ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్కోర గంగాధర్, కానిస్టేబుళ్లు షద్రాక్, గంగాధర్, శ్రీధర్, విజయ్, తిరుమలేష్, రాము పాల్గొన్నారు.



ఘనంగా జాతీయ టీకా దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలోని నాగారంలోగల తెలంగాణ గురుకుల గిరిజన మహిళా డిగ్రీ కళాశాల లో జాతీయ టీకా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ సైద జైనబు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ నాగారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారన్నారు. టీకా ప్రాముఖ్యతను వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ వీజీ.లక్ష్మి, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు హాజరయ్యారు.



పరీక్షా కేంద్రం తనిఖీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం ఉదయం జరిగిన ఎంబిఏ, ఎంసీఏ 3వ సెమిస్టరు (రెగ్యులర్) పరీక్షల్లో 462మంది విద్యార్థులకు గాను 432మంది హాజరయ్యారని, 30 మంది గైర్హాజరయ్యారని, తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ డాక్టర్ ఎం అరుణ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబిఎ, ఎంసిఎ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 562 మంది విద్యార్థులకు గాను 519 మంది హాజరయ్యారని, 43 మంది గైర్హాజరు అయ్యారని డాక్టర్ అరుణ తెలిపారు. యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ భవనంలో జరుగుతున్న పరీక్ష కేంద్రాన్ని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ డాక్టర్ అరుణ సందర్శించారు.

హక్కులు, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలి

- టీయూలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

భారత రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులను, రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలని డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ పి పద్మావతి కోరారు. తెలంగాణ యూనివర్సిటీలోని కామర్స్ డిపార్ట్మెంట్ కళాశాల సెమినార్ హాల్ లో గురువారం వర్సిటీ ఉమెన్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ అపర్ణ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సెక్రటరీ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిజామాబాద్, పి పద్మావతి, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ అంజన హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా హాజరైన సెక్రటరీ డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నిజామాబాద్ పద్మావతి మాట్లాడుతూ.. మహిళా దినోత్సవం ఒకే రోజు జరుపుకోకుండా మహిళలను గౌరవించి ఈ ఏడాది ఉత్సవాలు నెలపాటు జరుపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు.ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం, విద్య అందించడంతోనే మహిళలు ముందంజలో ఉంటారని ఆమె అన్నారు. మహిళలు చదువుకున్నప్పుడే ఇల్లు బాగుపడుతుందని సొసైటీ బాగుంటుందని, మహిళలు ప్రత్యేక అతిథి నిజామాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాలలో ముందు వరుసలో ఉన్నారని, విమాన పైలట్లుగా, మెట్రో రైళ్లలో పైలెట్లుగా రాణిస్తున్నారని అన్నారు. తమకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని విద్యార్థినిలకు సూచించారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి. రవీందర్ మాట్లాడుతూ టీయూలో ఈ ఏడాది అడ్మిషన్లలో 80 శాతం మహిళా విద్యార్థినులు ఉండడం గొప్ప విషయమని అన్నారు. తెలంగాణ యూనివర్సిటీలో వర్సిటీ రిజిస్ట్రార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషనర్ , బిక్కనూరు సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా మహిళా అధ్యాపకులు ఉండటం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆరతి, వర్సిటీ ఉమెన్ సెల్ డైరెక్టర్ అపర్ణ, పరీక్షల నియంత్రణ అధికారిణి ప్రొఫెసర్ అరుణ, లావణ్య త్రివేణి, జవేరియా, విద్యార్థినిలు, మహిళలు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాట్లాడుతున్న పద్మావతి

ఆల్‌ఫోర్స్ పాఠశాలకు మెమో జారీ

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఏర్పాటు చేయకుండా పాఠశాలలో ప్రవేశాల కోసం ప్రచారం చేస్తూ తల్లిదండ్రులను మభ్యపెడుతూ మోసానికి గురి చేస్తున్న ఆల్ ఫోర్స్ పాఠశాల యాజమాన్యానికి మెమో జారీచేసినట్టు మండల విద్యాధికారి రాజా గంగారం గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి అడ్మిషన్స్ కోసం ప్రచారం చేస్తున్నందున నమ్మి మోసపోవద్దు పేర్కొన్నారు.

అంతుకూరి మెల్లమాంబ జయంతి వేడుకలు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని పాలెం గ్రామంలో శాలివాహన కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అంతుకూరి మెల్లమాంబ 583వ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. మండల అధ్యక్షుడు సిద్ధయ్య మాట్లాడుతూ.. మహిళలందరూ వెల్లమాంబను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వం శాలివాహన కుమ్మరులను గుర్తించి కుల వృత్తులను ప్రోత్సహించే విధంగా ప్రతినెల 5000 రూపాయలను చేతివృత్తిదారులకు పంపిణీ చేయాలని తెలిపారు. జీవో నెంబర్ 1076/17 ప్రకారం కుమ్మరిలకు కేటాయించిన కుంటలను కుమ్మరులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, శాలివాహన సంఘం సభ్యులు గంగాధర్, దేవేందర్, నాగేష్ పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలకు ఇంటర్వ్యూలు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆన్లైన్లో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. రెండు యూనిట్లకు గాను 62 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని 1:3 ప్రాతిపదికన దరఖాస్తులను ఎంపిక చేసి మైనార్టీ కార్పొరేషం కు పంపినట్లు ఎంపీడీవో లక్ష్మీప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ ఎస్బీసీసీ బ్యాంక్ మేనేజర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ గద్కుల్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పశుసంవర్ధక శాఖ మండల వైద్యాధికారి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

వైభవంగా స్వామివారి కల్యాణం

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని నర్సింగ్ పల్లి గ్రామంలోని ఇందూరు తిరుమల క్షేత్రంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా గురువారం ఉదయం యజ్ఞం అనంతరం స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. గరుడ వాహనంపై నూతనంగా చేయించిన రథంపై స్వామి వారిని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాల్లో దేవనాథ జీయర్ స్వామి, ఆచార్య గంగోత్రి రామానుజదాస్ స్వామి, దిల్ రాజు, నర్సింహారెడ్డి, విజయసింహ రెడ్డి, శిరీష్, సర్పంచ్ సాయరెడ్డి, ఎంపీటీసీ రాములు, భక్తులు పాల్గొన్నారు.

పట్టణ బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారుల నియామకం

నవతెలంగాణ-ఆర్మూర్

సాధారణ సర్వసభ్య సమావేశంలో బార్ అసోసియేషన్ ఎన్నికల అధికారులుగా విజయలక్ష్మి, గటడి ఆనంద్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షులు విప్లవ కిరణ్‌ను నియమించి నియామక పత్రం గురువారం అందజేశారు. కార్యక్రమంలో సెక్రెటరీ ప్రవీణ్ చందర్, వైస్ ప్రెసిడెంట్ కోనేరు, కోశాధికారి కొండి పవన్, సంయుక్త కార్యదర్శి బుట్టి మధు, కార్యదర్శి చైతన్య, మహిళా ప్రతినిధి వీణ, సీనియర్ న్యాయవాదులు భూపతి రెడ్డి, గంట సదానందం, కిష్టయ్య, బేతు జగదీష్, రయ్యాడి రాజేశ్వర్, మురళి, అశోక్, కృష్ణ నెహ్రూ, తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రం అందజేస్తున్న విప్లవ కిరణ్

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని వివేక్ నగర్ తండా గ్రామపంచాయతీ భవనానికి ఎంపీపీ కుంచాల విమల రాజు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకా రంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి 20 లక్షలతో నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధూలీబాయి, ఉప సర్పంచ్ వెంకటేష్, మండల కో ఆప్షన్ మెంబర్ బులెట్ అక్బర్ ఖాన్, టీఆర్ఎస్ మండల యువ నాయకులు అప్పల అరుణ్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మండలంలో అభివృద్ధి పనుల గుర్తింపు

- ఎంపీటీసీల అత్యవసర సమావేశం



నవతెలంగాణ-మాక్లూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని ఎంపిపి ఛాంబర్ లో మండల ఎంపిటిసిలు ఎంపిపి మస్త ప్రభాకర్ అధ్వర్యంలో అత్యవసర సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఎంపిటిసిల పరిధిలోని 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులను గుర్తించారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో చర్చించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి క్రాంతి, ఎంపిటిసిలు గోవురి ఒడ్డెన్న, ఎస్. వెంకటేశ్వర్ రావు, పురుషోత్తంరావు, సత్యనారాయణ, మీరాబాయి, పూజిత, సుజాత, గంగమని తదితరులు పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ

నవతెలంగాణ-మోర్తాడ్

మండలలోని మూడు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి మండల నాయకులు గురువారం భూమి పూజ నిర్వహించారు. వడ్యాట్ గ్రామంలో 17 లక్షల రూపాయల నిధులతో, పాలెం గ్రామంలో 15 లక్షలు, మోర్తాడ్‌లో రూ. 50 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, జడ్పీటీసీ రవి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్, మూడు గ్రామాల సర్పంచులు, వెల్మరూపా రవీందర్, ఏనుగు సంతోష్, భోగ ధరణి ఆనంద్, ఏలియా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్పులూరు గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి గురువారం సర్పంచ్ బద్దం పద్మా చిన్నారెడ్డి శంకుస్థాపన చేశారు. గ్రామంలో రూ. 30 లక్షలతో 11 బిట్లుగా సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రి ప్రశాంత్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అవారి మురళి, నాయకులు అమర గోని సదాశివ గౌడ్, అవారి గంగారెడ్డి, ఉట్నూరు రవి గౌడ్, చిలుకూరి మారుతి, నందగిరి శ్రీధర్, రాజ్ వీర్, బద్దం శ్రీనివాస్, అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మేదారం భూమన్న, ఉత్తూరి రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్: మండలంలోని గుంజిలి గ్రామంలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ శంకర్ గురువారం ప్రారంభించారు. నిధులు కేటాయించిన ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు రంజిత్ కుమార్, శివరామ కృష్ణ, పండరి, కిరణ్, వార్డు మెంబర్లు రంజిత్, పోశెట్టి, గంగాధర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

మోపాల్: మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులకు గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లతా కన్నిరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి 20 లక్షల రూపాయలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ క్యాతం రవి, ఉప సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీ ముత్తన్న, బీఆర్ఎస్ నాయకులు సతీష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు, గ్రామ కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, కెంపు భూమయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



మోర్తాడ్: రోడ్డుపనులకు భూమిపూజ చేస్తున్న నాయకులు



మోపాల్‌లో..



కమ్మర్‌పల్లి : ఉప్పులూరులో..

ప్రజల మధ్య చిచ్చులు పెడుతున్న కేంద్ర ప్రభుత్వం

- కాంగ్రెస్ అధికార మాజీ ప్రతినిధి మార చంద్రమోహన్

నవతెలంగాణ-ఆర్మూర్

దేశ ప్రజల మధ్య చిచ్చులు పెడుతున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ అధికార ప్రతినిధి మార చంద్రమోహన్ అన్నారు. పట్టణంలోని పెర్కిట్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంరద బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజల మధ్య చిచ్చులు పెడుతూ విభజన చేస్తూ దేశ సంపదనను తన మిత్రులకు దోచిపెడుతుందన్నారు. ప్రజలను కలపడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశారని అన్నారు. ఆయన సందేశాన్ని ప్రజలకు చేరవేసేందుకు పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేపడుతున్న హాత్ సే హాత్ జోడో యాత్ర నియోజకవర్గానికి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రైతుల కోసం ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్ 100 శాతం అమలు చేస్తాం అని అన్నారు. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధరలు పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గిస్తాం అని అన్నారు, ఆర్మూర్ నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం జరిగే రేవంత్ రెడ్డి యాత్రలో రైతులు యువకులు మహిళలు ప్రజలు అందరు భారీ సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పెర్కిట్ నుండి యాత్ర ప్రారంభమై పాత బస్టాండ్‌లో కార్నర్ మీటింగ్ తో యాత్ర ముగుస్తుందని తెలిపారు కార్యక్రమంలో నాయకులు కోలా వెంకటేష్, జిమ్మి రవి, అజ్జు, చిన్నారెడ్డి, మీసాల రవి, హబీబ్, మెహెబూబ్, బాల కిషన్, దినేష్,పాషా , కిషోర్, అఫ్రోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార చంద్రమోహన్

భారీ వర్షాల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నందున ఏర్గట్ల మండల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మొక్కజొన్నలు,ఎర్రజొన్నలు పట్టినవారు ఉంటే టార్పాలిన్‌తో కప్పాలని, కోతలు కోయని వారు కొద్దిరోజులు వాయిదా వేయాలని, రసాయన మందులు, ఎరువులు పిచికారీ చేయడం వాయిదా వేయాలని సూచించారు.

న్యాయవిద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలోని న్యాయ కళాశాలలో లీగల్ ఎయిడ్ సెల్ సంచాలకులు డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా ఆధ్వర్యంలో గురువారం న్యాయ శాస్త్ర విద్యార్థులకు, ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బెంగళూరులోని క్రిస్టు జయంతి న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ మోహన్‌రావు బొల్లా ముఖ్యఅతిథిగా హాజరై చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మోహన్ రావు బొల్లా మాట్లాడుతూ న్యాయ శాసనాలలో పలుతప్పులు ఉన్నాయని, దీనివల్ల పలు క్రిమినల్ కేసులలో ముద్దాయిలు శిక్షల నుండి తప్పించుకుంటున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు పలు కేసులలో దీనిని గుర్తించి ప్రస్తావించిందన్నారు. న్యాయ విద్యార్థులు, న్యాయవాదులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అలా ఉంటేనే న్యాయమూర్తులకు కేసు విషయాలను వివరించ గలరని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ డాక్టర్ జెట్లింగ్ ఎల్లోసా మాట్లాడుతూ న్యాయవిద్య ప్రపంచంలో అతి ముఖ్యమైందన్నారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే ప్రసన్న రాణి, విభాగాధిపతి డాక్టర్ బి స్రవంతి, డాక్టర్ రామలింగం, డాక్టర్ నర్సయ్య, డాక్టర్ ప్రవీణ్ తోపాటు విద్యార్థులు, న్యాయవాదులు,రీసర్చ్ స్కాలర్స్ పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర మహాసభలు రెండు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విజయవంతంగా పూర్తయ్యాయని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యశివాజీ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసిన బీడీ కార్మికులకు, మేధావులకు విప్లవ అభినందనలు తెలిపారు.

తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ నూతన రాష్ట్ర కార్యవర్గం ఇదే...

గౌరవ అధ్యక్షులుగా బి. భూమన్న (నిజామాబాద్), రాష్ట్ర అధ్యక్షులుగా చింత భూమేశ్వర్ (జగిత్యాల), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం .హరిత(నిర్మల్), ప్రధాన కార్యదర్శిగా బి.సూర్య శివాజీ (నిజామాబాద్), ఉపాధ్యక్షులుగా అరుణ (హైద రాబాద్), ఆకుల రాములు (సిరిసిల్ల), సహాయ కార్య దర్శిగా ఎండి ఖాజామొనుద్దీన్ (నిజామాబాద్), జిందం రాం ప్రసాద్ (కరీంనగర్), ఆర్గనైజింగ్ సెక్రటరీగా యం.మనెమ్మ (సిరిసిల్ల), నిర్మాణ కార్యదర్శిగా జేపీ గంగాధర్ (నిజామాబాద్), కోశాధికారిగా సామల గంగాధర్ (జగిత్యాల)లతోటు 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చింత భూమేశ్వర్ , బి సూర్య శివాజీ, సహాయ కార్యదర్శి ఎం డి కాజా మొయినుద్దీన్, రాష్ట్ర నిర్మాణ కార్యదర్శి జేపీ గంగాధర్,రాష్ట్ర నాయకులు శివ కుమార్, ఇఫ్టు నాయకులు జె ల్లా మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : ఐఎఫ్‌టీయూ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) 9వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి దాసు కార్మిక లోకానికి విజ్ఞప్తి చేశారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో మహాసభల కరపత్రాన్ని గురువారం ఆవిష్కంచారు. ఈసందర్భంగా దాసు మాట్లాడుతూ.. ఈనెల 18న నిజామాబాద్ నగరంలో ఎన్ఆర్ భవన్ లో మహాసభలు ఉంటాయన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి, నాలుగు లేబర్ కోడులుగా కుదించి 12 గంటల పని విధానం పెంచే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తుందని దుయ్యబట్టారు. కార్మిక సంఘాల ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చేటట్లు కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ఆదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు అమ్మివేస్తున్నారని తెలిపారు. దేశంలో 44 కోట్ల మంది కార్మికులు ఉంటే కేవలం ఐదు కోట్ల మందికే చట్టాలు అమలుచేసి మిగతా కార్మికుల బతుకులుని గాలికి వదిలేశారని ఆయన అన్నారు. మహాసభల్లో కార్మిక సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందిస్తామని దాసు తెలిపారు. సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సొప్పరి గంగాధర్ భాను, శేఖర్, పి.సాయన్న, రేణుక, భూదేవి, బుచ్చక్క, రాజగంగు, సాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధాత్రి టౌన్‌షిప్‌లో 50ప్లాట్ల వేలం

- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో టీఎస్ఐఐసి ఆధ్వర్యంలో ధాత్రి టౌన్‌షిప్ ప్లాట్ల రెండవ విడత వేలంపాట ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. నిజామాబాద్‌కు ఆనుకుని మల్లారం వద్ద ప్రభుత్వపరంగా అన్ని వసతులతో నెలకొల్పిన ధాత్రి టౌన్ షిప్ లో మొదటి విడతగా గత నవంబర్ నెలలో 80 ప్లాట్ల విక్రయాల కోసం బహిరంగ వేలం నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మరో 150 ప్లాట్ల విక్రయాలకు వేలం పాట నిర్వహిస్తున్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో వరుసగా మరో రెండు రోజుల పాటు వేలం ప్రక్రియ కొనసాగనుంది. గురువారం ఉదయం 25 ప్లాట్లకు, మధ్యాహ్నం 25 ప్లాట్లకు ఓపెన్ యాక్షన్ జరిగింది. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, బిడ్డర్ల నుండి ఈఎండీ ధరావత్తు పది వేల రూపాయల డీడీని స్వీకరిస్తూ, టోకెన్లు, దరఖాస్తు ఫారాలు అందించేలా చర్యలు తీసుకున్నారు. టోకెన్ కలిగిన వారిని వేలంపాట జరిగే సమావేశం హాల్ లోనికి అనుమతించారు. వేలంలో పాల్గొనే బిడ్డర్ల సందేహాలను నివృత్తి చేసేందుకు హెల్ప్ డెస్క్, బ్యాంకు డీడీలు తీసేందుకు వీలుగా ప్రత్యేక కౌంటర్ ను సైతం అందుబాటులో ఉంచారు. కాగా, శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్న బహిరంగ వేలం ప్రక్రియకు సకాలంలో బిడ్డర్లు పాల్గొనాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు. ఇదివరకు 8000 రూపాయలు ఉన్న చదరపు గజం ప్రారంభ ధరను రూ. 6000 ప్రభుత్వం తగ్గించిందని తెలిపారు.

ఉప్లూర్‌లో రేషన్ షాపు ప్రారంభం


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్‌లో నూతనంగా మంజూరైన రేషన్ షాపును సర్పంచ్ బద్దం పద్మ చిన్నారెడ్డి గురువారం ప్రారంభించారు. అవారి సంఘం షాపింగ్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన రేషన్ దుకాణాన్ని సర్పంచ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు లబ్దిదారులకు రేషన్ బియ్యాన్ని సర్పంచ్ చేతుల మీద అందజేశారు. సందర్భంగా రేషన్ డీలర్ నరేష్ కు పలువురు బిఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పిప్పెర అనిల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు అవారీ మురళి, నాయకులు అవారి గంగారెడ్డి, నందగిరి శ్రీధర్, చిలుకూరి మారుతి, రేషన్ డీలర్ సామ నరేష్, బీఆర్ఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ధర్పల్లి

మండ లంలోని దమ్మన్నపేట్ గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ ద్వారా మంజూరైన పదిలక్షల రూపాయలతో సీసీ రోడ్ల పనులను సర్పంచ్ కొండా శేఖర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్,జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్ మోహన్ సహకారంతో మంజూరైన నిధులతో రెండు గల్లీల్లో రోడ్లు వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, రాజ్పాల్ రెడ్డి, కిషోర్ రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బట్టి విక్రమార్కకు స్వాగతం పలికిన మదన్ మోహన్



నవతెలంగాణ-సదాశివనగర్

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని సదాశివనగర్ మండలం మర్కల్ స్టేజి వద్ద సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు పీసీసీ ఉపాధ్యక్షుడు మదన్ మోహన్ గురువారం స్వాగతం పలికారు. ఆయన ఆదిలాబాద్ జిల్లాకు వెళ్లగా.. అక్కడ ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొంబోతుల లింగాగౌడ్, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సంపత్‌గౌడ్, తూర్పు రాజులు తదితరులు పాల్గొన్నారు.

గాయపడ్డ వ్యక్తి మృతి

- గ్రామంలో విషాఛాయలు



నవతెలంగాణ-గాంధారి

గాయపడ్డ వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని గండివేట్ గ్రామానికి చెందిన కొమ్ము సంజీవులు (36) అనే యువకుడు ఈ నెల 8వ తేదీన సాయంత్రం ఏడు గంటల సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కాగా అతడిని కుటుంబ సభ్యులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య కుమారుడు, కూతురు ఉన్నారు.

లబ్దిదారులకు చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కోటగిరి



చెక్కు అందజేస్తున్న స్పీకర్

మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఉమ్మడి మండలంలోని రెండు పడక గదుల అర్హులైన లబ్దిదారులకు పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం చెక్కులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల రెండు పడక గదుల నిర్మాణం చేపట్టామని, రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా డబుల్‌బెడ్ రూములు ఏర్పాటు చేసి అర్హులైన పేదవారికి అందించామన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ నాగేశ్వరరావు, జడ్పీటీసీ శంకర్ పటేల్, తహసీల్దార్లు శ్రీకాంతారావు, విజయలక్ష్మి, మార్కెట్ కమిటీ చైర్మన్ హమీద్, మండల రైతు కన్వీనర్ కిషోర్ బాబు, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయం వృథా చేయొద్దు

- ఎంఈఓ నాగనాథ్

నవతెలంగాణ-బోధన్

త్వరలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు చదువుకోకుండా కాలాన్ని వృధా చేయవద్దని బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్ సూచించారు. బుధవారం రాత్రి సాలూర మండలంలోని ప్రజ్ఞశ్రీ హైస్కూల్ 23వ వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపాలని పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అహుతులను ఆలరించాయి. ఈ సందర్భంగా గత సంవత్సరం 10/10 జీపీఏ సాధించిన 8 మంది విద్యార్థులను పాఠశాల కరెస్పాండెంట్ లతారాజు షీల్డ్ అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్య ప్రకాష్, విద్యావికాస్ కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు, ప్రజ్ఞ శ్రీ హైస్కూల్ అధినేత రాజు, కరస్పాండెంట్ లత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ఎడపల్లి మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు గురువారం అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ క్యాంపు



ఎన్ఎస్ఎస్ క్యాంపులో ముగింపులో పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి

ఎస్ఆర్‌కే డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని సోమారం గ్రామంలో ఏడురోజుల ఎన్ఎస్ఎస్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి సర్పంచ్ చరణ్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ ఏడు రోజులు క్యాంపులో భాగంగా గ్రామంలో ఉన్న చెత్తచెదారాన్ని, అలాగే మురికి వాడలను శుభ్రం చేశారని, గ్రామంలో ఉన్న ప్రజలకు మూఢనమ్మకాలపైన, అలాగే సీజనల్ వ్యాధులపైన అవగాహన కల్పించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్‌లో భాగంగా మా గ్రామాన్ని ఎంచుకున్నందుకు ఎస్ఆర్కే డిగ్రీ, పీజీ కళాశాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఆర్కే గ్రూప్ ఆఫ్ కరస్పాండెంట్ అండ్ సీఈవో డాక్టర్ ఎం.జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి విద్యతోపాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా పాలు పంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ దత్త్రాతి, మధుసూదన్ రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సాయిలు, మురళి, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో పాదయాత్రను విజయవంతం చేయండి

- ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-గాంధారి

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో చేపట్టే రేవంత్‌రెడ్డి పాదయాత్రను విజయవంతం చేయాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇంచార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఎల్లారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల19న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి నిర్వహిస్తున్న హత్ సే హత్ జోడో పాదయాత్ర గాంధారి మండలంలోని గుడిమెట్ గ్రామ చౌరస్తా నుంచి వెళ్తుందని, మండల కేంద్రంలో కార్నర్ మీటింగ్ నిర్వహిస్తారని కావున నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్క కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సుభాష్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

షాదీముబారక్ చెక్కు అందజేత

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామానికి చెందిన లబ్దిదారులకు సర్పంచ్ కపిల్ పటేల్ చేతుల మీదుగా షాదీముబారక్ చెక్కును గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బస్వాపూర్ సర్పంచ్ రవిపటేల్, బీఆర్ఎస్ నాయకులు చిన్నఎడ్డి శీవాజీ పటేల్, మహమ్మదాబాద్ తాండా జాదవ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణపల్లిలో కంటివెలుగు ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బ్రాహ్మణపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్యాధికారులు స్థానిక నాయకులతో కలిసి సర్పంచ్ లక్ష్మీ కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గ్రామంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ప్రభుత్వం అద్దాలు అందజేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల నర్సింలు, పంచాయతీ కార్యదర్శి జానకి, పాలకవర్గ సభ్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే ఫ్యాక్టరీ తెరిపిస్తాం

- పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన 6 నెలల్లోనే బోధన్ నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం హత్ సే హత్ జోడో పాదయాత్రలో భాగంగా బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రాజెక్టులు, రైల్వేలైన్‌లు, ప్రజలకు అవసరమయిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కటి అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామన్న కేసీఆర్ హామీ ఇప్పటికీ అమలు కాలేదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలో వస్తే ముస్లింలకు రిజర్వేషన్‌లు పెంచుతామన్నారు. అలాగే రైతులకు 2లక్షల రూపాయల రుణమాఫీ, మహిళల కోసం రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీ వైద్య సౌకర్యం 5 లక్షల రూపాయల వరకు ఉచితంగా అందిస్తామని అన్నారు. ఈ తెలంగాణ ప్రభుత్వంలో ప్రాజెక్టుల పేరుతో అందిన కాడికి దండుకున్నారని విమర్శించారు. పేదలకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రభుత్వంలో నిరుపేదలకు ఏ ఒక్క సంక్షేమ పథకం అందడం లేదని అన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడంతోనే కేసీఆర్ సీఎం అయ్యారని లేకుంటే వారు దిక్కులేని వారయ్యేవారని మండిపడ్డారు. ఈ సభలో మాజీ మంత్రులు అంజన్ కుమార్ యాదవ్, సుదర్శన్ రెడ్డి, షబ్బీర్ అలీ, మల్లు రవి, రాష్ట్ర నాయకులు మహేష్ కుమార్ గౌడ్, ఈరవత్రి అనిల్, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోధన్ సభలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌ను తొలగించాలి

- బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్

నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌ను తొలగించాలని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ డిమాండ్ చేశారు. పేపర్ లీక్‌ను నిరసిస్తూ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా టీఎస్పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ.. పేపర్ లీకేజ్‌పై సీబీసీఐడీతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కాన్ఫిడెన్షియల్ విభాగంలోకి ఇతర సెక్షన్లలో డ్యూటీ చేసే వ్యక్తులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎలా ప్రవేశించారో, యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌లు వారి చేతికి ఎలా వచ్చాయో, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ప్రవీణ్ కుమార్, నెట్వర్క్ మేనేజర్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రాజశేఖర్‌రెడ్డి పాత్రపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలన్నారు. సాధించుకున్న తెలంగాణలో కష్టపడి చదివి ఉద్యోగం సాధిస్తానని ఎన్నో ఆశలతో కలలుగన్న విద్యార్థుల నిరుద్యోగులను ప్రభుత్వం మరోసారి మోసం చేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం కమిషన్ సభ్యులందరిపైనా విచారణ చేపట్టాలని తెలంగాణ విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని, అవసరమైతే కొత్త కమిషన్ వేయాలని, ప్రస్తుత కమిషన్ రద్దు చేయాలని కోరారు. లేకుంటే విద్యార్థులతో నిరుద్యోగులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్బాస్ ఖాన్, కళాశాల అధ్యక్షులు యోగేష్, విద్యార్థులు రాహుల్, శ్రవణ్, మనోజ్, రాము, లావణ్య, కవిత, శ్రీలత విద్యార్థులు పాల్గొన్నారు.

రూ.257 కూలి వచ్చేలా పని కల్పించాలి

- జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న

నవతెలంగాణ-గాంధారి

ఉపాధిహామీ కూలీకి రూ.257 కూలి వచ్చేలా పని కల్పించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సాయన్న మాట్లాడుతూ.. నర్సరీలలో అన్ని మొక్కలు మొలకెత్తే విధంగా చూడాలని, ప్రతి నర్సరీలో అన్ని రకాల మొక్కలు ఉండాలని, ప్రతి నర్సరీకి షేడ్ నెట్ ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలని తెలిపారు. ఎప్పటికప్పుడు పంచాయతీ కార్యదర్శులు ట్రాక్టర్ ద్వారా మొక్కలకు నీళ్ల పోసి వాటరింగ్ డబ్బులు చెల్లించే విధంగా ట్రిప్ షీట్ రాసి ఇవ్వాలని ఆయన సూచించారు. తొందరలోనే నర్సరీలకు సంబంధించిన బ్యాగ్ ఫిల్లింగ్ పెండింగ్ పేమెంట్ ఉంటే తొందరగా క్లియర్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి సాయన్న

దోమకొండను
మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలి

- విప్ గంపగోవర్ధన్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ గ్రామ పంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని కోరుతూ ఎంపీపీ శారదా, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్, సర్పంచ్ అంజలి నాయకుల ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌కు గురువారం కామారెడ్డి విప్ నివాసంలో ప్రజాప్రతినిధులు, నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శారదా, సర్పంచ్ అంజలి మాట్లాడుతూ.. దోమకొండ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటు కోసం అన్ని అర్హతలు ఉన్నాయని, గ్రామ పంచాయతీ పాలకవర్గం, జిల్లా పరిషత్ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం తరపున ఏకగ్రీవ తీర్మానం చేసి స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గంప గవర్ధన్‌కు వినతిపత్రాన్ని అందజేశామని తెలిపారు. దోమకొండ గ్రామంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 13 వేలకు పైగా జనాభా కలదని, 2014 సంవత్సరంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 15 వేల పైచీలుకు జనాభా ఉందని, ప్రస్తుతం దోమకొండ గ్రామంలో 20 వేల వరకు జనాభా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్ ప్రతేక చొరవ తీసుకొని దోమకొండ గ్రామాన్ని మున్సిపాలిటీగా మార్చడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి మున్సిపాలిటీ అయ్యే వరకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శేఖర్, నాయకులు నర్సరెడ్డి, శ్రీనివాస్, నాగరాజు, ఎంపీటీసీలు నాయకులు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయం

- ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

చేపల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఇందిరా పథకం కార్యాలయంలో చేపల పెంపకంపై రైతులకు అవగాహన శిక్షణలో అయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ ద్వారా రైతులు తమ పంట పొలాల్లో చేపల చెరువులను కూలీల సాయంతో తవ్వించుకోవచ్చన్నారు. చేపల పెంపకంపై ఆసక్తి చూపిస్తే రైతులు పంటపొలాలతోపాటు చేపల పెంపకంపై దృష్టి పెడితే అతను పాదాయం పొందవచ్చన్నారు. ఇప్పటికే గ్రామాల్లో చాలామంది గ్రామ సంఘాలు, మహిళలు చేపల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారన్నారు. అదేవిధంగా ఉపాధి ద్వారా గొర్రెలకు, మేకలకు, బర్రెలకు షెడ్లు.. పంట పొలాలకు రోడ్లు వేసుకోవచ్చన్నారు. మండలంలో ఆయా గ్రామాలకు చెందిన 150 మంది రైతులకు చేపల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మరో వారం రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్, సీసీలు గంగరాజు, శ్రవణ్, మెహర్, మన్సూర్, స్వప్న, రాజేశ్వర్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ రవాణా చట్టాన్ని రద్దు చేయాలి



నవతెలంగాణ-వర్ని

ఆటో కార్మికులకు ఉరితాడుగా మారిన మోటర్ రవాణా చట్టం 2020ను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రుద్రూర్ మండలంలోని సులేమాన్‌నగర్‌లో ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన మోటర్ వాహన చట్టం ఆటో కార్మికుల పొట్ట కొడుతుందని మండిపడ్డారు. జరిమానాల పేరుతో పోలీసుల వేధింపులు ఎక్కువయ్యాయని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల సంక్షేమానికి "సంక్షేమ బోర్డు" ఏర్పాటు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆటో కార్మికులు గౌస్, మహెబూబ్, సాయికుమార్, నాగరాజు, ఖాజా, జలీల్, ఫయాజ్, శివ, అంజి తదితరులు పాల్గొన్నారు.

బెల్లాల్‌లో రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-బోధన్

మండలంలోని బెల్లాల్ గ్రామంలో సర్పంచ్ రమావత్ రాజు సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే షకీల్ అమీర్ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.15లక్షల నిధులు మంజూరి చేశారని, వాటితో పనులు చేపట్టినట్టు తెలిపారు. గ్రామాల అభివృద్ధి అనేది ఎమ్మెల్యే షకీల్ అమీర్ కృషితోనే సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, వార్డ్ మెంబర్ జాకీర్, పంచాయతీ సెక్రెటరీ సురేష్, గ్రామపెద్దలు బుర్రి లక్ష్మణ్, శ్రీనివాస్, నీలకంఠం గౌడ్, అను, అమీర్, నాగులు, రాజేందర్, రఫిక్, రహమత్ జానీ, రాజాగౌడ్, మునీర్, చందర్, ఇర్ఫాన్, లింగం గ్రామస్తులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

కంటివెలుగును సందర్శించిన కలెక్టర్



వైద్యులతో కలెక్టర్

నవతెలంగాణ-గాంధారి

మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం సందర్శించారు. క్యాంపునకు విరివిగా జనాలు వచ్చే విధంగా, మొబైల్ స్టేషన్ బాధ్యతలు ప్రత్యేకంగా ప్రజా ప్రతినిధులు చేపట్టాలని ఆయన అన్నారు. క్యాంపు జరుగుతున్న తీరును అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీల కోసం, వికలాంగుల కోసం ప్రత్యేకంగా క్యాంపులు పెట్టి సదరం సర్టిఫికెట్ ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్, సర్పంచ్ లక్ష్మీ, పాలకవర్గ సభ్యుడు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు వేల్పుల నర్సింలు, సొసైటీ డైరెక్టర్ పోచయ్య, పంచాయతీ కార్యదర్శి జానకి, డాక్టర్లు కంటివెలుగు సిబ్బంది, పాలకవర్గ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బోధన్ జిల్లా సాధనకు మద్దతు ఇవ్వాలని రేవంత్‌రెడ్డిని కోరిన న్యాయవాదులు



వినతిపత్రాన్ని అందజేస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

బోధన్‌ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని న్యాయవాదులు రిలే దీక్షలు నిర్వహిస్తూ గురువారం పాదయాత్రలో భాగంగా బోధన్ నియోజవర్గంలో పర్యటిస్తున్న పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి బోధన్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు కలిసి వినతిపత్రం అందించారు. న్యాయవాదుల విన్నపానికి స్పందించిన రేవంత్‌రెడ్డి తన వంతుగా పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని కలిసినవారిలో న్యాయవాది సిహెచ్.వి హన్మంతరావు, ఎం.గంగారెడ్డి, వీరభద్రప్ప, బాణోత్ రమేష్ నాయక్, సాయిలు, శ్రీధర్ బాబు, అజయ్, అజర్ అహ్మద్ తదితరులున్నారు.

ఇంటర్ పరీక్షలకు విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-విలేకరులబృందం

పిట్లం : మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర తెలుగు, హిందీ పరీక్షలకు ఆరుగురు విద్యార్థులు గైరాజరైనట్టు పరీక్షల నిర్వాహకులు సురేష్ కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసించిన విద్యార్థులు అనవసరంగా పరీక్షలకు హాజరు కాకుండా భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, పరీక్షలకు హాజరై మంచి భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన సూచించారు.

జుక్కల్ : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం మొదటి రోజు తెలుగు లాంగ్వేజ్ పరీక్షకు గానూ మొత్తం 203 విద్యార్థులకు గాను, 184 మంది విద్యార్థులు హజరైయ్యారని, 19మంది పరీక్షలకు గైర్హాజరైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ అరవింద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సదాశివనగర్ : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష రెండవ రోజులో భాగంగా గురువారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ పరీక్ష సదాశివనగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్ నెంబర్ 46002 మొత్తం విద్యార్థుల సంఖ్య 272కి గానూ 270 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, ఇద్దరు గైర్హాజరైనట్టు వివరించారు. పరీక్షా కేంద్రాన్ని సదాశివనగర్ తహసీల్దార్ ధన్వాల్‌సింగ్ పర్యవేక్షించారు. డిపార్మెంటల్ ఆఫీసర్ వసంత్, చీఫ్ సూపరింటెండెంట్ ప్రతాప్ కిరణ్ తెలిపారు.

వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణంలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, టీఎస్ఎంఎస్ఐడీసీడీ అధికారుల బృందం గురువారం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద స్థలం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జాజాల సురేందర్ కృషితో త్వరలో పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. స్థలం పరిశీలనలో టీఎస్ఎంఎస్ ఐడీసీడీ డీఈ సుధాకర్, ఏఈ సాగర్, ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, సంబంధిత కాంట్రాక్టర్, ఎల్లారెడ్డి బీఆర్ఎస్ అధికార ప్రతినిధి రామప్ప, బీఆర్ఎస్ నాయకుడు శ్రవణ్ కుమార్ రాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులున్నారు.

వైస్ ఛాన్స్‌లర్ రవీందర్‌ను కలిసిన తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సభ్యులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ లో ఈనెల 28, 29 తేదీల్లో తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సమావేశాలు నిర్వహణపై అవకాశం కల్పించాలని వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ డి రవీందర్‌ను తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ సభ్యులు గురువారం కలిసి కోరారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్స్ లర్ రవీందర్ మాట్లాడుతూతెలంగాణ ప్రాంతానికి ఎంతో గొప్ప చరిత్ర, సంస్కృతి ఉన్నాయని వాటిని అధ్యయనం చేసి శోధించాల్సిన అవసరం ఉందన్నారు. హిస్టరీ కాంగ్రెస్ నిర్వహణకు వీసీ సానుకూలత వ్యక్తం చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని, సదస్సు కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బాల శ్రీనివాసమూర్తి, నిర్వహణ కమిటీ సభ్యులు డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ సాయిలు, డాక్టర్ అబ్దుల్ ఖావి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు స్వాగతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి



నిజామాబాద్ జిల్లా పర్యటనకు గురువారం హాజరైన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథికి జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. డిచ్‌పల్లి పోలీస్ బెటాలియన్ గెస్ట్ హౌస్ వద్దకు చేరుకున్న కమిషనర్ పార్థసారథిని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, బెటాలియన్ కమాండెంట్ సత్య శ్రీనివాస్ రావు, ఆర్డీఓ రవి తదితరులు స్వాగతం పలికి, పూల మొక్కలు, బొకేలు అందించారు. కలెక్టర్, ఇతర అధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అక్కడే కొద్దిసేపు సమావేశమై, పలు అంశాలపై చర్చించారు. అంతకుముందు కమిషనర్ పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు.

ఉపాధ్యాయుల ఆర్థిక బిల్లులు మంజూరుకోసం

24న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

- టీపీటీఎఫ్ అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా ట్రెజరీ కార్యాలయాల్లో అనుమతి పొందిన బిల్లును వెంటనే చెల్లించాలని, ఉద్యోగ ఉపాధ్యాయుల వేతనాలు ప్రతినెల మొదటి తేదీన ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేయాలని టీపీటీఎఫ్ నిజామాబాద్ జిల్లా శాఖ ఉపాధ్యాయులకు గురువారం టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వెనిగళ్ళ సురేష్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బిల్లులు సకాలంలో మంజూరు కాక ఉపాధ్యాయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. బ్యాంకు కిస్తులు కూడా చెల్లించలేని పరిస్థితి ఉందని, జీపీఎఫ్ అడ్వాన్సు, మెడికల్ బిల్లులు, సరెండర్ లీవ్, ఏరియర్స్ బిల్లులు రాక ఉపాధ్యాయులు తీవ్ర మనస్థాపానికి లోనవుతున్నారని తెలిపారు. మంజూరైన బిల్లులన్నీ ఈ నెల 31 వరకు చెల్లించకపోతే రద్దయ్యే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌తో కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆన్సర్‌షీట్లు పోలీసు బందోబస్తు మధ్య తరలించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ
- రెండోసంవత్సరం పరీక్షలకు 636 మంది గైర్హాజరు



ఏర్పాట్ల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా కేంద్రంలోని ఖలీల్వాడి లో గల ఎస్-ఎస్ఆర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీసీ కెమెరా రికార్డింగ్ నడుమ నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్న పత్రాలను తెరిచారా...? లేదా...? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతిని గమనించారు. లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి, తదితరులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలకు గురువారం మొదటి రోజు 636 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. 16,355 మంది విద్యార్థులకు 15,719 మంది హాజరయ్యారని అన్నారు. జనరల్ విద్యార్థులు 14,395 మంది 13,973 మంది హాజరుకాగా 462 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ 1,960 మంది విద్యార్థులకు 1786మంది హాజరుకాగా 174 మంది విద్యార్థులు గైర్హాజరైయ్యారని చెప్పారు. మూడు పరీక్షా కేంద్రాలను తనిఖీచేసి సమీక్షించగా జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్, చిన్నయ్య, కనకమహాలక్ష్మి 12 పరీక్ష కేంద్రాలను, హైపవర్ కమిటీ రాజీయుద్దిన్ నాలుగు పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్, సెట్టింగ్ స్క్వాడ్ బందాలు 29 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

డబుల్ బెడ్ రూం కోసం ఉద్యమించాలి

- బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం ఇవ్వాలని, నిజామాబాద్ నగరం లో దాదాపు పది వేల మంది అర్హులైన పేదలు 20 సంవత్సరాల నుండి ప్రభుత్వ స్థలాల్లో చిన్న చిన్న గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారందరికీ వెంటనే పట్టాలు మంజూరు చేసి ఐదు లక్షల రూపాయల రుణాలు మంజూరు చేయాలని బీఎల్‌పీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూం, సొంత ప్లాట్ ఉన్న వారికి మూడు లక్షల రూపాయల రుణాలు మంజూరు చేస్తామని మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. అర్హులైన పేదలు డబుల్ బెడ్ రూం స్కీం లో పేరు ప్రకటన వచ్చే వరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌కు ఐదు వందల మంది దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో బీఎల్‌పీ జిల్లా కన్వీనర్ కె.మధు, బీఎల్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, నగర కన్వీనర్ హైమద్ హుస్సేన్, నాయకులు మహమ్మది బేగం, కపిల్, శోభా, సంజీవ్, గంగా శంకర్, కష్ణ, గోపినాథ్ దాదాపు ఐదు వందల మంది పాల్గొన్నారు.

కంటి వెలుగు వైద్య బృందానికి సన్మానం



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామంలో రెండో విడత కంటివెలుగు కార్యక్రమం విజయవంతంగా పూర్తయిన సందర్భంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కంటి వెలుగు వైద్య బృందం, సిబ్బందిని సర్పంచ్ దయ్య దేవయ్య ఘనంగా సన్మానించారు. కంటి వెలుగు బందం చౌట్ పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వివేక్, కంటి వైద్యులు విశాల, హెల్త్ సూపర్వైజర్ సత్యనారాయణ, డీఈవో రాము, ఏఎన్ఎం శోభారాణి, అమత, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ వివేక మాట్లాడుతూ గ్రామంలో వారం రోజులపాటు నిర్వహించిన శిబిరంలో 904 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అందులో దగ్గరచూపు 51 మందికి అద్దాలు అందజేసినట్లు తెలిపారు. దూరపు చూపు అద్దాలు అవసరమైన 111 మందికి త్వరలోనే అందిస్తామన్నారు. కంటి ఆపరేషన్లు అవసరమైన 26 మందిని జిల్లా కేంద్ర ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ జలంధర్, పంచాయతీ కార్యదర్శి రజిత, వార్డు సభ్యులు లక్ష్మి నారాయణ, పొలాస హన్మంత్, మల్యాల రవి, గ్రామ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ కుంచాల విమల రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కంటి వెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకొని కంటి చూపు మెరుగుపరచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఎంపిటిసి గంగారెడ్డిచ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంగన్వాడి కార్యకర్తలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

టీబీ వ్యాధిగ్రస్తులకు ఆహార కిట్లు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సుదర్శన్ ఆహార కిట్స్ పంపిణి చేశారు. దుబ్బ అర్బన్ హెల్త్ సెంటర్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీ రోగులకు చికిత్స అందించడం లో నిజామాబాద్ జిల్లా ముందంజలో ఉందని అన్నారు. ఆహార కిట్లు అందజేసిన రెడ్ క్రాస్ చైర్మన్ బుస్స ఆంజనేయులు, తోట రాజశేఖర్‌ను ఆయన అభినందించారు. గుండె పోటుతో అనేకమంది చనిపోతున్నారని రెడ్ క్రాస్ ద్వారా సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చి శిక్షకులను తాయారు చెయ్యడానికి రెడ్ క్రాస్ భవన్ లో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చైర్మన్ బుస్స ఆంజనేయులు తెలిపారు. తెలిపారు. కార్యక్రమం లో రెడ్ క్రాస్ రాష్ట్ర ఈ సి మెంబెర్ తోట రాజశేఖర్, అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ అధికారి, ఆరోగ్య అధికారి వెంకటేశ్వర్లు, టీబీ నిరోధక శాఖ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విశేష స్పందన

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొనసాగుతున్న నిత్యాన్నదానానికి విశేష స్పందన లభిస్తుంది. పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల సైతం పాల్గొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్య అన్నదానం బడుగు బలహీన పేదప్రజల ఆకలిని తీరుస్తుంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు పూజ నరేందర్, సీనియర్ నాయకులు పండిత్ ప్రేమ్, మండల యూత్ అధ్యక్షులు క్రాంతి, చాలా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆర్మూర్

బీజేపీ, బీజవైఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో గురువారం అంబేద్కర్ చౌరస్తా వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు జెస్సు అనిల్ కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మందుల బాలు, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు కలుగోట ప్రశాంత్ మాట్లాడుతూ... టీఎస్పీఎస్సీ పేపర్ లీక్ చేసిన దుర్మార్గులను వదిలేసి టీఎస్పీఎస్సీ పేపర్ల లీకేజీపై ఆందోళనకు దిగిన బీజేవైఎం కార్యకర్తలను అరెస్టు చేసి నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టడాన్ని ఖండిస్తునానమన్నారు. నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ చెలగాటమాడుతున్నాడని అన్నారు. బీజేవైఎం కార్యకర్తలను వెంటనే బేషరతుగా విడుదల చేసి వారిపై బనాయించిన కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలిపారు. టీఎస్పీఎస్సీ ఘటనపై వెంటనే సిబిఐతో గానీ, సిటింగ్ జడ్జితో గాని ఎంక్వయిరీ చేయించి ఈ ఘటనతో సంబంధమున్న ఎంతటి వ్యక్తులనైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు విజయానంద్, సీనియర్ నాయకులు భూపేందర్, సైవే రాజ్ కుమార్, కౌన్సిలర్ బ్యావత్ సాయికుమార్. బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శులు ఉదయ్ గౌడ్, పసుపుల సాయికుమార్. ఉపాధ్యక్షులు పెరంబదూర్ వాసు, సాయినాథ్ రెడ్డి. కార్యదర్శి రెడ్డిబోయిన మూర్తి, దళిత మోర్చ పట్టణ అధ్యక్షులు పులి యుగంధర్, ప్రధాన కార్యదర్శి బ్యావత్ ప్రవీణ్ కుమార్. ఓబీసీ మోర్చా ఆర్మూర్ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి మిర్యాల్కర్ కిరణ్, కార్యదర్శి బట్టు రాము, గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు గుగులోత్ తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

నాగంపేట్‌లో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-ముప్కాల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకాల్లో ఒకటి 'కంటి వెలుగు' కార్యక్రమం గురువారం మండలంలోని నాగంపేట్ గ్రామంలో సర్పంచ్ కాశిరెడ్డి రాజవ్వతో కలిసి ఎంపీపీ సామ పద్మవెంకట్ రెడ్డి జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ ప్రణవ రోగులకు వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సామ పద్మ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందని అన్నారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ వెంకట్ రెడ్డి, సర్పంచ్ కాశిరెడ్డి రాజవ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్న రాజన్న, ఎంపీటీసీ సభ్యులు మేడిపల్లి మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు దాసరి గంగాధర్, కె.యం.రెడ్డి, పంచాయతీ సెక్రటరీ గౌతమి, హెల్త్ సూపర్ వైజర్ భీమన్న, మేరమ్మ, ఆరోగ్య శాఖ సిబ్బంది, వార్డ్ సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్ వాడి ఉపాధ్యాయులుపాల్గొన్నారు..



సర్పంచ్‌తో కలిసి కంటివెలుగును ప్రారంభిస్తున్న ఎంపిపి

అసంఘటిత రంగ కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రతి రంగంలో శ్రమని నమ్ముకుని పనిచేసే అసంగటితరంగ కార్మికులు సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి అరేపల్లి సాయిలు అన్నారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాలు కార్మికులను కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన అన్నారు.. కేంద్రంలోని బీజేపీ ఇన్సూరెన్స్, పెట్రోల్, డీజిల్, వంట గ్యాతో పాటు.అన్ని రకాల నిత్యావసర వస్తువు ధరలను విపరీతంగా పెంచడమే కాకుండా వాటిపై జీఎస్‌టీ వేసి ప్రజలను నిలువునా దోపిటీ చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రమాదంలో మరణించిన ప్రతి డ్రైవర్ కుటుంబానికి 5లక్షల రూపాయల ప్రమాద బీమా ఇస్తానని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ 2017 మేడే రోజు చాలా గొప్పగా ప్రకటించారన్నారు. ఇప్పటి వరకు ప్రమాదంలో మరణించిన డ్రైవర్ కుటుంబానికి కూడా రూపాయి ఇచ్చిన పరిస్థితి లేదన్నారు. జీవోను జారీచేశారే తప్ప నయాపైసా బడ్జెట్ కేటాయించలేదని తెలిపారు. భవన నిర్మాణ రంగంలో లేబర్ కార్డ్ ఉన్న ప్రమాద బాధితులకు పరిహారం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో కార్మికుల ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయాలని ఆయన అన్నారు

ప్రభుత్వం ఏ ఒక్కరికి కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సుధాకర్

రాష్ట్ర ప్రభుత్వం ఏ ఒక్కరికి కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం ఒకటో డివిజన్‌లోని విఠలేశ్వర్ కాలనీలోగల ఫిట్టర్ యూనియన్ కార్యాలయంలో సీపీఐ జిల్లా ముఖ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తెచ్చి ప్రతి ఒక్క కుటుంబానికి 15 లక్షలు వేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని తెలిపారు. దేశ సంపద లక్షల కోట్లు దోచుకున్న కార్పొరేట్లను దేశాన్ని దాటిస్తున్నాడని అన్నారు. నిత్యావసర వస్తువులకు జీఎస్టీని కట్టించుకుంటూ కార్పొరేట్ శక్తులకు ఈ మధ్యకాలంలో 10 లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేశారని తెలిపారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నూరు హామీలు ఇచ్చి ఆరు మాత్రమే అమలు చేసిందన్నారు. నీడలేనటువంటి వారందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలని, ఇప్పటికే స్థలాలున్న వారికి ఆరు లక్షల రూపాయలు ఇల్లు నిర్మాణం కోసం ఇవ్వాల్సిందేనని అన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకపోవడం దారుణమని, ఇప్పటికైనా అర్హులకు రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వై.ఓమయ్య రాజేశ్వర్, రమేష్, అనిల్, రఘురాం, రంజిత్, అంజలి పాల్గొన్నారు.

వినియోగదారులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి

- డీసీఐసీ చైర్మన్ రాజేశ్వర్

నవతెలంగాణ-కంఠేశ్వర్



మాట్లాడుతున్న రాజేశ్వర్

వినియోగదారులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని డీసీఐసీ చైర్మన్ రాజేశ్వర్ తెలిపారు. గురువారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్‌లోగల తన కార్యాలయంలో వినియోగదారుల అవగాహన చైతన్య సదస్సు సమావేశం నిర్వహించారు. జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం చైర్మన్ మాయావర్ రాజేశ్వర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. చైర్మన్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు నాణ్యత పరిమాణం చూడాలని అన్నారు. ఐఎస్ఐ అగ్మార్క్, హాల్ మార్క్ ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఎలక్ట్రానిక్ గూడ్స్‌కు వ్యాపారి వద్ద నుండి వారంటీ గ్యారంటీ కార్డు తో పాటు బిల్లులు పొందాలని కోరారు. నూతన వినియోగదారుల చట్టం 2019 లో పార్లమెంటులో ఆమోదం పొందిన తర్వాత జూలై 2020 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఎక్కడైనా కల్తీ జరిగినట్టు అనుమానం వస్తే ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. నాన్ ఐఎస్ఐ వాటర్ నీళ్లను తాగొద్దని అన్నారు. ఎక్స్‌పైరీ డేట్ చూసి కొనుగోలు చేయాలని తెలిపారు. డాక్టర్స్, లేబరేటరీస్, స్కానింగ్ సెంటర్స్, బ్లడ్ యూరిన్ టెస్టుల్లో ప్రజలకు అన్యాయం జరిగితే జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసులు వేయాలని కోరారు. తూనికల్లో, కొలతల్లో మోసాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులకు తెలియజేయాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ డబ్బులు వసూలు చేసే యజమానులపై కూడా లీగల్ మెట్రోలజీ అధికారులకు తెలపాలని అన్నారు. ఆన్లైన్ లో వస్తువులు కొనుగోలు చేయొద్దని తెలిపారు. వినియోగదారులు జిల్లా వినియోగదారుల కమిషన్ లో 50 లక్షల వరకు నష్టపరిహారం పొందవచ్చని, రాష్ట్ర వినియోగదారుల కమిషన్ లో 10 కోట్ల వరకు జాతీయ కమిషన్ లో 10 కోట్లపై నష్టపరిహారం పొందడానికి నూతన వినియోగదారుల చట్టంలో పొందుపరిచారని తెలిపారు. వస్తువులు కొనుగోలు చేసినప్పుడు, సేవలు పొందినప్పుడు తప్పకుండా రసీదు బిల్లు పొందాలన్నారు. కార్యక్రమంలో డి సి ఐ సి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

టీఎస్‌పీఎస్సీ ఏఈ పరీక్ష పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నిజామాబాద్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈనెల 5న జరిగిన టీఎస్పిఎస్సీ ఏఈ పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఏవో ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పిట్ల నరేష్ , ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీ వ్యవహారంపై సెట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన నాటినుండి నియామకాలు లేక ఉద్యోగాల కోసం ఎదురుచూపులు చూస్తున్న నిరుద్యోగులు ఇలాంటి చర్యలు తీవ్ర నష్టం చేస్తాయని వారు అన్నారు. లక్షల రూపాయలు వెచ్చించి లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాలకు కోచింగ్ తీసుకుంటున్నారని వారన్నారు. బోర్డులో ఇంత జరుగుతున్న కనీసం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహించిన బోర్డు చైర్మన్ జనార్దన్ రెడ్డి, కార్యదర్శి పాత్రపై సభ్యుల పాత్ర పైన విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వ స్పందించి చైర్మన్‌ను తొలగించి వారిపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నైతిక బాధ్యత వహిస్తూ బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆశీర్వాదం, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షులు విశాల్, శివ పాల్గొన్నారు.



శ్రీ చైతన్యలో ఫ్యామిలీ గ్లోరీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



నిజామాబాద్ శ్రీ చైతన్య వినాయక్ నగర్ బ్రాంచ్‌లో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఫ్యామిలీ గ్లోరి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు వారి తల్లి దండ్రుల పాదాలు కడిగి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎలీషా మాట్లాడుతూ.. నేటి ఆధునిక సమాజంలో కుటుంబం, తల్లిదండ్రులు, విలువలు, మానవ సంబంధాల ప్రాధాన్యత తెలియజేయడమే ఈ ఫ్యామిలీ గ్లోరి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రీజినల్ ఇన్‌చార్జి కే.రాజు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తల్లితండ్రులను గౌరవించాలని, కుటుంబ సాంప్రదాయలు కాపాడాలని సూచించారు.తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ మేదరి శేఖర్, డీన్ సందిప్, పీఈటీ జగన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ రావు, డైరెక్టర్ విద్య, డిజియం లక్ష్మన్ రావు విద్యార్థులను, తల్లిదండ్రులను ,ఉపాధ్యాయులను అభినందించారు.

చేపూర్ గ్రామంలో సాయిబాబా విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని చేపూర్ గ్రామ శివారులోని నేషనల్ హైవే-16ను ఆనుకొని ఉన్న షిరిడి సాయిబాబా ఆలయం, దత్తసాయి ఆలయాల్లో గురువారం నందిపేట్ పలుగుట్ట కేదారేశ్వర ఆలయ వ్యవస్థాపకులు బాలయోగి మంగిరాములు మహారాజ్ పాల్గొన్నారు.సాయిబాబా ఆలయంలో ప్రతీ గురువారం నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహించే వంటగదిని, సాయిబాబా ఆలయ ఆవరణలో సాయిబాబా నిలబడి వంటచేస్తున్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. మంగి రాములు మహారాజ్ మాట్లాడుతూ మానవతా విలువలు గల ప్రతీ మనిషిలో దేవుడు ఉన్నాడని, అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదని తెలిపారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందూరు సాయన్న, ఎంపీటీసీ సభ్యులు గొల్లూరి బాల నర్సయ్య, ఉపసర్పంచ్ నడ్కుడ శ్రీనివాస్, వీడీసి అధ్యక్షులు సొక్కం సంజీవ్ సాయిబాబా, దత్తసాయి ఆలయ కమిటీ అధ్యక్షులు సురేష్ రుక్మాజి, పురోహితులు పారుపల్లి కిరణ్ కుమార్ శర్మ, కిరీటి కుమార్, పారుపల్లి శుభాంకర్ కాశ్యప్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు మహేష్, ప్రధాన కార్యదర్శి బద్దం ప్రవీణ్, కోశాధికారి పోశెట్టి, ప్రత్యేక సలహాదారులు సత్యనారాయణ, సభ్యులు లక్ష్మీనారాయణ, యేసు, ఇందూరు చిన్న సాయన్న, చరణ్ పాల్గొన్నారు.

9 మంది గైర్హాజరు

నవతెలంగాణ-ధర్పల్లి

ఇంటర్ రెండో సంవత్సరం మొదటి పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియ కలశాల, మోడల్ పాఠశాల పరీక్షల నిర్వహణ అధికారులు సురేష్ బాబు, రాజేంద్ర సాహులు గురువారం తెలిపారు. పరీక్షలు సజావుగా సాగుతున్నాయని, రెండో సంవత్సరం ఇంటర్ మొదటి పరీక్షకు 511 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా తొమ్మిది మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు,

టీఎస్పీఎస్సీ పరీక్ష పత్రాలు లీకేజీకి వ్యతిరేకంగా ప్రగతిభవన్ ముట్టడి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

టీఎస్పీఎస్సీ నిర్వహిస్తున్న టీపీబీవో, ఏఈ లాంటి పోటీ పరీక్షల పత్రాల లీకేజీకి వ్యతిరేకంగా, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జానార్ధన్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని, పపేర్ లీకేజీ ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే విచారణ చేపట్టాలని, ఈ అంశం పై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్యు, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో చలో ప్రగతి భవన్ ముట్టడి నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థి నేతలను అరెస్టు చేసి బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే అఫ్జర్, జాతీయ కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, ఆజాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంధ్య , రాష్ట్ర సహాయ కార్యదర్శి కే.స్వాతి, రాష్ట్ర కోశాధికారి సురేష్ పివైఎల్ రాష్ట్ర నాయకులు ప్రతాప్, సలీమ్ రాష్ట్ర నాయకులు సుమంత్, గణేష్, ఆశూర్, సంజీవ్, శ్రావణ్, రంగవల్లి దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలో గురువారం వాహనాల తనిఖీలు చేపట్టినట్లు ఏఎస్ఐ బాల్ సింగ్ తెలిపారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష పడుతుందని తెలిపారు. డ్రైవింగ్ లైసెన్సు, ఇన్సూరెన్స్ కాగితాలు తప్పక వాహనాల వెంబడి ఉంచుకోవాలని సూచించారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు గల పిల్లలకి వాహనాలు ఇవ్వరాదని పిల్లల తల్లిదండ్రులను కోరారు. పెండింగ్ చలానాలను వెంటనే మీ సేవలో చెల్లించాలని కోరారు. ఈయన వెంట సిబ్బంది శంకర్ తదితరులు ఉన్నారు.